# హాస్టల్లో పనిపిల్ల

మేం పుస్తకాల్లో దూకి అక్షర సముద్రంలో ఈదుతుంటామా
నువ్వు 'నదియా' జిమ్నాస్టిక్స్‌ని మించి నడుము వంచి
ఇల్లంతా అలుగ్గుడ్డై తిరుగుతుంటావు.
మేం సీతాకోక చిలుక రంగుల్ని ఒంటి కద్దుకుని
పూల పరిమళాల్ని చిమ్ముతూ నగర విహారం చేస్తోంటే
మా విడిచిన తొడుగుల మీద
డిటర్జెంట్ సబ్బూ, బ్రష్షై పరిగెడుతుంటావు
మధ్యాహ్నం మేం సాంబారు చట్నీ కూరల్తో
విందు భోజనమవుతున్న వేళ నువ్వు గంపెడాకలై
ఎంగిలి విస్తర్లా ఎగిరెగిరి పడుతుంటావు
సాయంత్రానికి -
వేడివేడి టీ కప్పై వేళ్ళు కాల్చుకుంటావు
సందేళ మేం ధారపోసి
నీ వేళ్ళల్లోని నరాలని దారాలుగా
మనసుని చెమ్కీగా అద్ది -
మా తల్లో పూల దండై వేలాడుతుంటావు.
కొండొకచో బజార్లో షాపింగ్ బుట్టై -
అపుడపుడూ పుస్తకాల కట్టై
పదేళ్ళ నీ పసితనం తిరగాడుతుంటుంది
మేం గల గలల జలపాతాలై దుముకుతుంటే
నువ్వో దుఃఖ శిలా సముద్రంలా గంభీరమవుతావు
మేం వెచ్చటి నీ పసితనాన్ని కప్పుకు కలల్ని స్వారీ చేస్తుంటామా
నువ్వు ఆవులింతలై కూరుకుపోతున్న కళ్ళు, సలుపుతున్న ఒళ్ళై
యుద్ధరంగం లాంటి వంటింట్లో క్షతగాత్ర పాత్రలకి సేవల్జేస్తుంటావు,
లోకం చీకటిని చిమ్ముతున్న వేళ బుగ్గల మీద కన్నీటి
కావ్యాల్నలంకరించుకొని నీకు నువ్వే ధన్వంతరివై
కటిక నేల మీద గాయాల్నద్దుకుంటుంటావు
అంతేనా....
నువ్వే సింహం నిద్రై ఉరుముకి పూచిన లిల్లీ పువ్వై
కోడికి కూతనీ, బద్ధకించిన సూరీడికి వెలుగునీ
అద్దటాన్కి చిటికెలో సిద్ధపడిపోతావు.

శ్రీ కేతవరపు రమణామూర్తి,
ఫిల్మ్స్ డివిజన్, జి. ఓ. ఐ,
గాంధీనగర్, విజయవాడ.



దియా: 13 సంవత్సరాలకే ఒలింపిక్స్‌లో పాల్గొని 10కి 10
ర్కులు సంపాదించి చరిత్ర సృష్టించిన ఏకైక క్రీడాకారిణి